క్లుప్తంగా

గల్ఫ్ ఏజెంటును అరెస్టు చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): గల్ఫ్ దేశాలకు పంపిస్తానని మోసానికి పాల్పడిన షేక్ బషీర్ అనే ఏజెంటును పోలీసులు త్వరగా అరెస్టు చేయాలని ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహా నాయుడు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నిర్వహించిన సమావేశంలో కోటపాటి మాట్లాడుతూ.. బషీర్ ఆరు నెలల క్రితం డిచ్‌పల్లిలో ఆర్‌కే ట్రావెల్స్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేసి సుమారు 500 మందిని మోసం చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసులు బషీర్‌ను అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నట్లు తెలిపారు.

కంటి శిబిరం ప్రారంభం

వర్ని: కోకల్ దాస్ తండాలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం వర్ని జెడ్పీటీసీ హరిదాసు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉచితంగా మందులు, అద్దాలు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని వివరించారు.

గోవింద్‌పేట్‌లో ముగింపు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ పీహెచ్‌సీ పరిధిలోని చేపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మానస మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 1,818 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 58 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం జిల్లా కేంద్రానికి సిఫారసు చేసినట్లు వెల్లడించారు. అనంతరం కంటివెలుగు వైద్య సిబ్బందిని జీపీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. సర్పంచ్ ఇందూర్ సాయన్న, కంటి వెలుగు క్యాంపు వైద్యాధికారిణి హుమేర యాస్మిన్, సూపర్‌వైజర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి

వేల్పూర్: రామన్నపేట్ గ్రామంలో ఆది హిందూ ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డివర్మకు సోమవారం షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు బాబూరావు, గంగారాం, వినోద్, డిన్నూ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో అధికారంలోకి వస్తాం

వర్ని: మహారాష్ట్రలో రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది అధికారంలోకి వస్తుందని డీసీసీబీ అధ్యక్షులు పోచారం భాస్కర్ రెడ్డి జోస్యం చెప్పారు. సోమవారం వర్ని ఎంపీడీవో కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహారాష్ట్రలో నాయకులు భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. వర్ని జెడ్పీటీసీ హరిదాసు, తహసీల్దార్ విఠల్, సొసైటీ చైర్మన్లు సాయిబాబా, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

బాల్కొండ/వేల్పూర్/నందిపేట : జిల్లాలో పలు చోట్ల సహకార సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. బాల్కొండ సహకార సంఘంలో చైర్మన్ సురాజ్ రెడ్డి, సర్పంచ్ బూస సునీత, వేల్పూర్ మండలం మోతె గ్రామంలో సొసైటీ చైర్మన్ మోతె రాజేశ్వర్, నందిపేట మండలం అయిలాపూర్‌లో సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్ చేతుల మీదుగా జీలుగ విత్తనాలను అందజేశారు. సబ్సిడీ పోను 30 కేజీల బస్తాను రూ.842 ధరకు అందించారు. ఒక రైతుకు గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. 30 కిలోల జీలుగ విత్తనాలను సుమారు 3 ఎకరాలకు చల్లుకోవచ్చన్నారు.

తల్లి, బిడ్డ గోమాతలు ఒకే రోజు ప్రసవం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలోని గోశాలలో తల్లీ బిడ్డ గోవులు ఒకే రోజు ప్రసవించాయి. ఆశ్రమ ట్రస్టు సభ్యులైన బేతి గోవింద్‌రెడ్డి, గంగాదేవి దంపతులు మార్చి 25, 2023న రెండు గోమాతలను(తల్లి, బిడ్డ) గోశాలకు గోదానం చేశారు. అవి ఒకే రోజు రెండు లేగదూడలకు జన్మనిచ్చాయి. దీంతో ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

'రామాలయ నిర్మాణ బాధ్యత మాదే'

మాక్లూర్: మాక్లూర్‌లో నిర్మించతలపెట్టిన రామాలయం, మిగిలి ఉన్న పనులన్నింటిని తామే పూర్తి చేయిస్తామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, అతని సోదరుడు మహేశ్ గుప్తాలు అన్నారు. సోమవారం అయ్యప్ప, ఆంజనేయ, రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర దేవత మూర్తుల ఊరేగింపు సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నగర మేయర్ దండు నీతుకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తీరనున్న లోవోల్టేజీ సమస్య

- కిసాన్‌నగర్‌కు సబ్‌స్టేషన్ మంజూరు
- రూ.కోటి నిధులు మంజూరు



సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్, బస్సాపూర్ గ్రామాలకు కలిపి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో విద్యుత్ సమస్య తీరనుంది. ఇది వరకు బాల్కొండ మండల కేంద్రంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి గ్రామానికి విద్యుత్తు సరఫరా చేపట్టేవారు. కిసాన్‌నగర్ మేజర్ గ్రామ పంచాయతీ. జనాభా పరంగా పెద్ద గ్రామం కావడం వల్ల విద్యుత్ వినియోగం కూడా ఎక్కువగా ఉంటుంది. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండేది. ప్రస్తుతం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే విద్యుత్ సమస్య తీరుతుంది. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధుల మంజూరుకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేయడంతో సాధ్యమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో బస్సాపూర్ గ్రామానికి కూడా విద్యుత్ సబ్ స్టేషన్ లేకపోవడంతో రెండు గ్రామాలకు కలిపి ఉపయోగపడేలా వరద కాలువ పరివాహక ప్రాంతంలో సబ్ స్టేషన్ నిర్మించటానికి ట్రాన్స్‌కో అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. బాల్కొండ మండలంలో ఇత్వార్‌పేట్, బస్సాపూర్, కిసాన్‌నగర్ గ్రామాల్లో మాత్రమే విద్యుత్తు సబ్‌స్టేషన్లు లేవు. ప్రస్తుతం కిసాన్‌నగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు కావడంతో మిగతా రెండు గ్రామాలు మాత్రమే విద్యుత్తు సబ్ స్టేషన్ లేని గ్రామాలుగా మిగులుతున్నాయి. త్వరలో ఆ గ్రామాలకు కూడా విద్యుత్తు సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రుణపడి ఉంటాం

కిసాన్‌నగర్‌లో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించటానికి నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రుణ పడి ఉంటాం. విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. స్థల పరిశీలన కూడా పూర్తయింది.

– బద్దం ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, బాల్కొండ

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేత శ్రీనివాస్‌రెడ్డి

బాల్కొండ: తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో మార్కెట్ కమిటీ యార్డులో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్షం రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తూకాలు వేసిన బస్తాలను తరలించడం లేదన్నారు. అకాల వర్షాలతో రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దవుతుంటే..బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు అంటూ పండుగలు చేసుకుంటున్నారని విమర్శించారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఆరేపల్లి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దత్తాపూర్, నికాల్‌పూర్ రోడ్లకు మోక్షం



డొంకేశ్వర్(ఆర్మూర్): గుంతలమయంగా మారిన దత్తాపూర్, నికాల్‌పూర్ రోడ్లకు మోక్షం కలిగింది. దత్తాపూర్ నుంచి నికాల్‌పూర్ దాబా ఎక్స్ రోడ్ వరకు, అలాగే ఎక్స్ రోడ్డు నుంచి నికాల్‌పూర్ ఊరి దాకా మొత్తం 4.3 కిలో మీటర్ల బీటీ రోడ్డును వేశారు. రూ.1.80కోట్లతో రోడ్డును వేసినట్లు ఆర్అండ్‌బీ ఏఈ రఘు తెలిపారు. తమ గ్రామాలకు బీటీ రోడ్డు వేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పాతూర్‌లోని నంది యూత్ సభ్యులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 40 మంది యువకులు పార్టీలో చేరగా.. పార్టీ కండువాలు మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ కప్పారు. సీఎం, ఆర్మూర్ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు యువకులు పేర్కొన్నారు.

అకాల వర్షంతో అన్నదాత ఆగమాగం



రెంజర్లలో కొనుగోలుకేంద్రంలో వరి ధాన్యం చుట్టూ నిలిచిన వర్షపు నీరు



సిర్పూర్‌లో కల్లంలో దిగబడిన వడ్ల లారీ

బాల్కొండ: ఆదివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వల్ల అన్నదాత ఆగమాగమయ్యాడు. కొనుగోలుకేంద్రాల్లో కొనుగోళ్లు నెమ్మదిగా సాగడం రైతుల పాలిట శాపమైంది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కుమ్మరించడంతో ధాన్యం తడిసి ముద్దయింది. కాంటాలు వేసి నెల రోజులు గడుస్తున్నా బస్తాలను తరలించకపోవడంతో తడిసిపోయాయి. అంతే కాకుండ సజ్జ పంటలు కూడా దెబ్బతిన్నాయి. నువ్వు పంట గురించి చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది. బలమైన ఈదురు గాలులు వీయడం వల్ల ధాన్యం కుప్పలపై కప్పిన తాటి పత్రాలు మొత్తం కొట్టుకుపోయాయి. దీంతో ధాన్యం వర్షం పాలైంది. రోడ్ల వెంబడి చెట్లు విరిగి పడ్డాయి. తడవని ధాన్యానికే 10 కిలోల కడ్తా తీస్తున్న మిల్లర్లు, తడిసిన ధాన్యానికి ఎంత కడ్తా తీస్తారోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లంలోనే దిగబడిన వడ్ల లారీ

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి సిర్పూర్‌లో వడ్ల లారీ కల్లంలోనే దిగబడింది. ధాన్యం బస్తాలను ఎక్కించుకుని మరో చోటికి వెళ్తుండగా లారీ ముందు చక్రం నేలలో పూర్తిగా దిగబడిపోయింది. దీంతో వర్షానికి బస్తాలు తడిశాయి. సోమవారం పొద్దున కూలీలు బస్తాలను లారీలోంచి దించారు. ట్రాక్టర్ సాయంతో లారీలని బయటకు లాగారు.

ప్రజలు శాంతిమార్గంలో పయనించాలి



ఎడపల్లి(బోధన్): ప్రజలందరూ శాంతి మార్గంలో పయనించాలని మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లిలో సోమవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి యువత నడుంకట్టాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు పెద్ద చెరువు సమీపంలో నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు.

అర్హత పరీక్ష నిర్వహించాలనడం సరికాదు



బోధన్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్యకు వినతి పత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

రుద్రూర్/బోధన్/కమ్మర్‌పల్లి : ఆశావర్కర్లకు మళ్లీ అర్హత పరీక్ష నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. కొన్నేళ్ల నుంచి వైద్య సేవలందిస్తున్న ఆశావర్కర్లకు అర్హత పరీక్ష నిర్వహించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం సరికాదన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కనీసం వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పలు చోట్ల ఆశావర్కర్లు ఆందోళనలు చేసి స్థానికంగా ఉన్న వైద్యాధికారులను కలిసి నాయకులతో కలిసి వినతి పత్రాలు అందించారు. ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలని అర్హులైన వారిని ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.



చౌట్‌పల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ..



రుద్రూర్ పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తూ..

యాగశాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీ సమీపంలో గల న్యూ వెంచర్లో నిర్మించనున్న యాగశాలకు సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి భూమిపూజ చేశారు. యాగశాల నిర్మాణానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి రూ.10 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నరోజి గంగారం, ఎంపీపీ అక్కపల్లి సుజాత, సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ఇస్లాంపుర కాలనీలో రూ. 20 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోచారం సురేందర్ రెడ్డి భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ పత్తి లక్ష్మణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమీద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కల్యాణ మండపం నిర్మాణానికి..

నందిపేట్(ఆర్మూర్): రైతుఫారం సమీపంలో మండల ఎస్సీ కల్యాణ మండపం నిర్మాణానికి సోమవారం ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. రూ.కోటి వ్యయంతో నిర్మించే కల్యాణ మండపానికి ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.50 లక్షలు ప్రొసీడింగ్ ఇచ్చారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోమన్‌పల్లి రాజన్న, ఎర్రటి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

లారీల సమస్యను పరిష్కరించండి

ఆర్మూర్‌టౌన్: రైతులకు ధాన్యం తరలించడానికి లారీల సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన వడ్లను సైతం తరలించడానికి లారీలు లేకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందన్నారు. ప్రభుత్వం వెంటనే రైస్‌మిల్ యజమానులతో మాట్లాడి లారీలు అన్‌లోడ్ అయ్యే విధంగా చూడాలన్నారు.

'భాగస్వాములను చేయకపోవడం అన్యాయం'



ఆందోళన నిర్వహిస్తున్న మేరు కులస్తులు

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పథకంలో మేరు కులస్తులను భాగస్వామ్యం చేయకపోవడం అన్యాయమని మేరు సంఘం అధ్యక్షులు రవీందర్ అన్నారు. మేరు కులస్తుల అభ్యున్నతికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం మేరు కులస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ..కులవృత్తులకు ప్రభుత్వం పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించేందుకు కేబినెట్ సమావేశంలో నిర్ణయించారని, ఆ జాబితాలో మేరు కులస్తులకు చేర్చకపోవడం బాధాకరమన్నారు. రవి, రాములు, సురేష్, సందీప్, కిరణ్, ఉదయ్, సాయిలు, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు యథేచ్ఛగా నరికివేత

- డొంకేశ్వర్ రోడ్డులో భారీ వృక్షాలు నేలమట్టం



డొంకేశ్వర్ వద్ద చెట్లను నరికివేసిన దృశ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): అధికారులు కష్టపడి పెంచిన హరితహారం చెట్లు యథేచ్ఛగా నరికివేస్తున్నారు. డొంకేశ్వర్ గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను రైతులు తొలగిస్తున్నారు. వందకు పైగా భారీ వృక్షాలను మెషిన్లతో కోసి నేలమట్టం చేశారు. హరితహారం కార్యక్రమంలో నిధులు వెచ్చించి రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వం చెట్లను నాటిస్తుంటే డొంకేశ్వర్ మండలంలో రైతులు, ఎలక్ట్రిసిటీ సిబ్బంది నీడనిచ్చె చెట్లను నరికివేస్తున్నా ఉన్నతాధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది?

- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నింబూరి సత్యవతి



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

బోధన్: ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని వైఎస్ఆర్‌టీపీ బోధన్ నియోజక వర్గ కో–ఆర్డినేటర్ నింబూరి సత్యవతి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రిజర్వేషన్లు కల్పిస్తామని మభ్య పెట్టి ముస్లింలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ 27వ వార్డులో నాయకురాలు షాహీన్ ఆధ్వర్యంలో ముస్లీం యువతీ, యువకులు అధిక సంఖ్యలో వైఎస్ఆర్‌టీపీలో చేరారు. పార్టీ కండువా కప్పి సత్యవతి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. నేతలు జగన్ గౌడ్, అశోక్, సంగమేశ్, షాహీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా



మున్సిపల్ ఆవరణలో మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 77 అంశాలతో పాటు మూడు టేబుల్ అంశాలు ప్రవేశపెట్టారు. కొన్ని అంశాలను విపక్ష కౌన్సిలర్లు, అధికార పార్టీ కౌన్సిలర్లు తిరస్కరించారు. కౌన్సిలర్‌లకు ఎటువంటి సమాచారం లేకుండా ఎజెండా అంశాలను ఏవిధంగా పొందుపరిచారని అధికారులను నిలదీశారు. మున్సిపల్ సమావేశం వాయిదా వేయాలని కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ప్రసాద్ చౌహన్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎజెండా అంశాల్లో అవకతవకలు

మున్సిపల్ ఎజెండాలో దొంగబిల్లులు పెట్టి మొక్కల, డీజిల్, మొరం పేరు మీద కోట్ల రూపాయలు దోచుకునేందుకు అంశాలను పొందుపర్చారని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు సాయి, కొంతం మంజుల, మురళీధర్, ఆకుల సంగీత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నవీపేట: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ, పుట్ట ఎల్లమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభించారు. మొదటి రోజు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, దేవతా విగ్రహాల ఊరేగింపులను నిర్వహించారు. ఈ నెల 24న ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	కస్టడీ – 12.20, 6.30 ది కేరళ స్టోరీ (తెలుగు) – 3.30 విరూపాక్ష – 9.40
స్క్రీన్-2 –	ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ– 10.00, 4.00, 10.00 (ఇంగ్లీష్) 1.00, 7.00
స్క్రీన్-3 –	అన్నీ మంచి శకునములే – 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియం కోర్సులు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 9154365020 నంబర్‌లో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

29వ రోజుకు చేరిన వీవోఏల సమ్మె

బాల్కొండ: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె సోమవారానికి 29వ రోజుకు చేరుకుంది. బాల్కొండ, ముప్కాల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద వీవోఏలు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీవోఏల జిల్లా ఉపాధ్యక్షులు అరుణ పాల్గొన్నారు.

కళాశాల అడ్మిషన్ల కోసం ప్రచారం

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ సోమవారం నందిపేట మండలంలోని అయిలాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెద్ది నారాయణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కళాశాల సౌకర్యాలు, అందిస్తున్న బోధనా పద్ధతులను వివరించారు. అధ్యాపకులు డి.వెంకటేశం, బీ.సాయగౌడ్ పాల్గొన్నారు.

పిరమిడ్ స్ట్రక్చర్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూరులో నిర్మిస్తున్న వాసవి కన్యకా పరమేశ్వరి ధ్యాన మహా క్షేత్రం 108/108 మహా పిరమిడ్ నిర్మాణాన్ని సోమవారం ఆర్మూర్‌కు చెందిన పిరమిడ్ వర్చువల్ సొసైటీ మూమెంట్(పీఎస్ఎస్ఎం) నవనాథపురం కమిటీ సభ్యులు పరిశీలించారు. అక్కడి వారితో మాట్లాడి పిరమిడ్ నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

బోధన్: బోధన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్యకు దళిత రత్న అవార్డు రావడంతో సోమవారం పట్టణ కేంద్రంలోని కోర్టులో న్యాయవాదులు ఆయనను సన్మానించి అభినందించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం. గంగారెడ్డి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి..

రుద్రూర్: రుద్రూర్ మండలం చిక్కడపల్లిలో కంటి వెలుగు శిబిరం ముగింపు సందర్భంగా సోమవారం జీపీ ఆధ్వర్యంలో ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. స్థానిక సర్పంచ్ పుష్పలత, బీఆర్ఎస్ సెగ్మెంట్ ఇన్‌ఛార్జి సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీ నరోజి గంగారాం పాల్గొన్నారు.

ఆరోగ్య జ్యోతికి అరుదైన గౌరవం

బోధన్: బోధన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతికి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. అంతర్జాతీయ నర్సు డే ను పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛందంగా వైద్య, సామాజిక విశిష్ట సేవలు అందిస్తున్న 50 మందిని ఎంపిక చేయగా, ఇందులో ఆరోగ్య జ్యోతి స్థానం లభించింది. ఆదివారం రాత్రి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య జ్యోతిని లేడీ విత్ ద ల్యాంప్ -2023 అవార్డు అందించి ఘనంగా సత్కరించారు.